రంగనాయక సాగర్‌పై సైక్లింగ్ పోటీలు

చిన్నకోడూరు, డిసెంబర్ 23: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టమీద రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి 33 జిల్లాలకు చెందిన 200 మంది సైక్లింగ్ క్రీడాకారులు పోటీపడుతున్నారు. అండర్-14, 16, 18 విభాగాల్లో బాలబాలికలు సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రాచకొండ సీపీతో జగన్ భేటీ

భారత్, ఇంగ్లండ్ టెస్టుపై 26న సమీక్ష

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా వచ్చే నెల 25న తొలి మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబును శనివారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెలలో జరుగనున్న టెస్టు మ్యాచ్‌కు అవసరమైన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. మ్యాచ్‌ను సజావుగా నిర్వహించేందుకు సహకారం అందించాల్సిందిగా సీపీని జగన్ కోరారు. మంగళవారం స్టేడియాన్ని పరిశీలిస్తానని ఆయన పేర్కొన్నారు. సీపీని కలిసిన వారిలో జగన్‌తో పాటు హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్, బసవరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రిక్వార్టర్స్‌లో స్వీటీ, పూజ

గ్రేటర్ నోయిడా: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్లు స్వీటీ బూర, పూజరాణి ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన 81కిలోల బౌట్‌లో స్వీటీ 4-1తో అల్బియా(ఆర్ఎస్‌పీబీ) పై అలవోక విజయం సాధించింది. అయితే స్వీటీకి అల్బియా దీటైన పోటీనిచ్చింది. మరోవైపు 75కిలోల బౌట్‌లో పూజ 5-0తో రేణు(నాగాలాండ్) ను చిత్తుగా ఓడించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన పూజ.. పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది.

ఫైనల్లో సహజ

ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ సహజ యమ్లపల్లి వరుస విజయాల జోరు కొనసాగిస్తున్నది. షోలాపూర్ వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ మహిళల టెన్నిస్ టోర్నీలో సహజ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్ సెమీస్‌లో సహజ 7-6(3), 6-2తో సాకి ఇకామురా(జపాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు ప్రదర్శించిన సహజ ప్రత్యర్థిని వరుస సెట్లలో మట్టికరిపించింది. ఆదివారం తుది పోరులో మకరోవాతో అమీతుమీ తేల్చుకోనుంది.

వీరేందర్‌సింగ్ పద్మశ్రీ వాపస్

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష ఎన్నికపై రగడ కొనసాగుతూనే ఉన్నది. బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ సన్నిహితుడైన సంజయ్‌సింగ్ ఎన్నికను వ్యతిరేకిస్తూ ఇప్పటికే సాక్షి మాలిక్ తన కెరీర్‌కు వీడ్కోలు పలుకగా, బజరంగ్ పునియా బాటలో ఇప్పుడు డెఫిలింపిక్స్ స్వర్ణ విజేత వీరేందర్‌సింగ్ యాదవ్ తన పద్మశ్రీ అవార్డు వాపస్ ఇస్తున్నట్లు శనివారం ప్రకటించాడు. 'గూంగా పహిల్వాన్'గా పేరొందిన వీరేందర్‌సింగ్..మహిళా రెజ్లర్లకు జరుగుతున్న అన్యాయానికి తన మద్దతు ప్రకటించాడు. 'నా పద్మశ్రీ అవార్డును ఈ దేశ ఆడబిడ్డలు, నా సోదరిమణుల కోసం వాపస్ ఇస్తున్నాను. గౌరవనీయులైన ప్రధాని మోదీ గారు రెజ్లర్లకు జరుగుతున్న అన్యాయంపై స్పందించాలి' అని వీరేందర్ ట్వీట్ చేశాడు.

జాతీయ ఫుట్‌బాల్ టీమ్‌లో జాఫర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉత్తరప్రదేశ్ వేదికగా జనవరిలో జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీకి రాష్ట్రానికి చెందిన సయ్యద్ మునావర్ జాఫర్ ఎంపికయ్యాడు. బాలుర అండర్-14 విభాగంలో తెలంగాణ స్కూల్ టీమ్ తరఫున జాఫర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

నేటి నుంచి అల్టిమేట్ ఖోఖో

కటక్: అల్టిమేట్ ఖో ఖో సీజన్-2కు ఆదివారం తెరలేవబోతున్నది. కటక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఖో ఖో పోటీలకు రంగం సిద్ధమైంది. తెలుగు యోధాస్, ముంబై ఖిలాడీస్ జట్లు తొలి పోరులో తలపడనున్నాయి.

గెలుపు దిశగా!

- ఆసీస్‌తో ఏకైక టెస్టుపై భారత్ పట్టు
- రాణించిన స్నేహ్ రానా, కౌర్
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 233/5
- భారత్ తొలి ఇన్నింగ్స్ 406 ఆలౌట్

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఏకైక టెస్టు పోరు హోరాహోరీగా సాగుతున్నది. ఆధిక్యం చేతులు మారుతూ వస్తున్న పోరులో ఆతిథ్య భారత్ పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ స్నేహ్‌రానా, హర్మన్‌ప్రీత్‌కౌర్ విజృంభించడంతో కంగారూలు ఐదు వికెట్లు కోల్పోయారు. 46 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్న ఆసీస్..భారత్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించేందుకు పట్టు దలతో ఉంది. దీప్తిశర్మ, పూజ వస్త్రాకర్ రాణింపుతో టీమ్‌ఇండియా..ఆసీస్‌పై రికార్డు స్కోరు నమోదు చేసింది. ఆఖరి రోజు ఆదివారం ఆటలోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తే..భారత్ ఖాతాలో మరో సిరీస్ చేరినట్లే.

హర్మన్‌ప్రీత్ కౌర్(2/23)

ముంబై: వాంఖడే వేదికగా జరుగుతున్న భారత్, ఆస్ట్రేలియా మహిళల ఏకైక టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. ఇటీవల ముగిసిన ఇంగ్లండ్ టెస్టుకు భిన్నంగా ఆసీస్ టీమ్..భారత్‌కు దీటైన పోటీనిస్తున్నది. మూడో రోజైన శనివారం..ఆసీస్‌ను నిలువరిద్దామనుకున్న టీమ్ ఇండియా ఆశలు నెరవేరలేదు. 187 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ ఆట ముగిసే సరికి 5 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. చేతిలో ఐదు వికెట్లు ఉన్న కంగారూలు ప్రస్తుతం 46 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. సదర్లాండ్ (12), గార్డ్‌నర్(7) క్రీజులో ఉన్నారు. స్నేహ్‌రానా(2/54), హర్మన్‌ప్రీత్‌కౌర్ (2/23) రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 376/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 406 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు దీప్తిశర్మ(78), పూజ వస్త్రాకర్(47) అదే జోరు కొనసాగించలేకపోయారు. 30 పరుగుల వ్యవధిలో టీమ్‌ఇండియా మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. ఓవరాల్‌గా టెస్టుల్లో ఆస్ట్రేలియాపై భారత్‌కు ఇదే తొలి ఇన్నింగ్స్ అత్యుత్తమ స్కోరు. ముఖ్యంగా దీప్తి, పూజ ఎనిమిదో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. టెస్టుల్లో ఎనిమిదో వికెట్‌కు భారత్‌కు ఇదే అత్యుత్తమం కాగా, ఓవరాల్‌గా రెండో బెస్ట్‌గా నిలిచింది.

కౌర్ కమాల్:

భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్..భారత్‌కు దీటైన పోటీనివ్వడంలో సఫలమైంది. ఇంగ్లండ్ తరహాలో కంగారూలను కట్టిపడేద్దామనుకున్న టీమ్‌ఇండియా వ్యూహాలు ఫలించలేదు. ఓపెనర్లు బేత్ మూనీ (33), లిచ్‌ఫీల్డ్ (18) ఆసీస్‌కు మెరుగైన శుభారంభం అందించారు. ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో మూనీని రీచాఘోష్ సూపర్ త్రోతో పెవిలియన్ పంపడంతో 49 పరుగుల వద్ద ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన ఎలీస్ పెర్రీ(45)భారత్ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరించింది. అయితే రానా బౌలింగ్‌లో లిచ్‌ఫీల్డ్ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత మెక్‌గ్రాత్ (73)..పెర్రీకి జత కలవడం ఇన్నింగ్స్ గతిని మార్చేసింది. వీరిద్దరిని ఔట్ చేసేందుకు బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. దీంతో తానే స్వయంగా బౌలింగ్‌కు దిగిన కెప్టెన్ కౌర్ అనుకున్న ఫలితం సాధించింది. రానా బౌలింగ్‌లో వికెట్‌కీపర్ భాటియా క్యాచ్‌తో పెర్రీ నిష్క్రమించడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఆ తర్వాత కౌర్ తొలి బంతికే మెక్‌గ్రాత్ వికెట్ల ముందు దొరికిపోయింది. అయితే డీఆర్ఎస్‌కు వెళ్లిన మెక్‌గ్రాత్ 52 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నాటౌట్‌గా బయటపడింది. నిరాశచెందని కౌర్..మెక్‌గ్రాత్‌ను క్లీన్‌బౌల్డ్ చేసింది. షాట్ ఆడే క్రమంలో మెక్‌గ్రాత్ నాలుగో వికెట్‌గా వెనుదిరిగింది. మరో ఎండ్‌లో ప్రమాదకరంగా మారుతున్న కెప్టెన్ అలీసా హీలీ (32)ని కౌర్ ఎల్బీడబ్ల్యూ చేయడంతో టీమ్‌ఇండియా సంబురాల్లో మునిగిపోయింది. ఈ క్రమంలో షార్ట్ ఫార్వర్డ్ లెగ్‌లో జెమీమా రోడ్రిగ్స్ వరుస బంతుల్లో హీలీ ఇచ్చిన క్యాచ్‌లు విడిచిపెట్టడంతో రాజేశ్వరి గైక్వాడ్‌కు నిరాశే ఎదురైంది. ఆటకు ఆఖరి రోజైన ఆదివారం ఆసీస్‌ను తొందరగా ఆలౌట్ చేసి లక్ష్యాన్ని ఛేదించేందుకు టీమ్‌ఇండియా పట్టుదలతో ఉంది.

406

ఆస్ట్రేలియాపై టెస్టుల్లో భారత్‌కు ఇదే తొలి ఇన్నింగ్స్ అత్యుత్తమ స్కోరు. దీప్తిశర్మ, పూజ వస్త్రాకర్ ఎనిమిదో వికెట్‌కు నెలకొల్పిన 122 పరుగుల భాగస్వామ్యం.. ఈ ఫార్మాట్‌లో బెస్ట్‌గా రికార్డు అయ్యింది.

సంక్షిప్త స్కోరు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 219 **ఆలౌట్, భారత్ తొలి ఇన్నింగ్స్:** 406 **ఆలౌట్, ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 233/5(మెక్‌గ్రాత్ 73, పెర్రీ 45, కౌర్ 2/23, రానా 2/54)

కివీస్ 98 ఆలౌట్

మూడో వన్డేలో బంగ్లా విజయం

నేపియర్: సొంతగడ్డపై వన్డేల్లో న్యూజిలాండ్ వరుస విజ.యాల (17) జోరుకు బంగ్లాదేశ్ బ్రేక్ వేసింది. శనివారం జరిగిన మూడో వన్డేలో బంగ్లా 9 వికెట్ల తేడాతో కివీస్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 31.4 ఓవర్లలో 98 పరుగులకు కుప్పకూలింది. బంగ్లాపై కివీస్‌కు ఇది అత్యల్ప స్కోరు కావడం విశేషం. షోరిఫుల్ ఇస్లాం (3/22), తంజిమ్ హసన్ (3/14), సౌమ్య సర్కార్ (3/18) ధాటికి ఓపెనర్ విల్‌యంగ్ (26) మినహా అందరూ స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా.. 15.1 ఓవర్లలో వికెట్ కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ నజ్ముల్ (51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించాడు. తంజిమ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', విల్‌యంగ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ భేటీ

- ఇద్దరి మధ్య 3 గంటలకు పైగా చర్చ
- మర్యాదపూర్వక భేటీ అన్న పీకే
- భేటీని విమర్శించిన వైకాపా

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకున్నది. గత ఎన్నికల్లో వైకాపాకి వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్ శనివారం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. దీంతో వీరి భేటీ ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిపోయింది. శనివారం మధ్యాహ్నం గన్నవరం ఎయిర్‌పోర్టుకు పీకే చేరుకున్నారు. అక్కడి నుంచి నారా లోకేశ్‌తో కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. అక్కడ బాబుతో సుమారు 3 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. జగన్ ప్రభుత్వ పనితీరు, పాలనపై చర్చించినట్టు సమాచారం. సమావేశం అనంతరం బయటకు వచ్చిన పీకేను విలేకరులు ప్రశ్నించగా.. చంద్రబాబు సీనియర్ నేత అని, అందుకే మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చానని తెలిపారు. తమ భేటీపై ఎలాంటి ఊహాగానాలు వద్దని కూడా చెప్పడం గమనార్హం. మరోవైపు బాబు, పీకే భేటీపై వైకాపా నేతలు స్పందించారు. మాజీ మంత్రి పేర్ని నాని, అంబటి రాంబాబు చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. గతంలో పీకేను తిట్టిన బాబు, లోకేశ్ ఇప్పుడు ఏం మొఖం పెట్టుకొని ఆయనను కలిశారంటూ నిలదీశారు. మెటీరియల్ చెడ్డదైతే మేస్త్రీ ఏం చేస్తారంటూ అంబటి సెటైరికల్ ట్వీట్ చేశారు.

మరాఠా కోటా కోసం 20 నుంచి ఆమరణ దీక్ష

బీడ్ (మహారాష్ట్ర), డిసెంబర్ 23: ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల్లో మరాఠాలకు రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని ఉద్యమకారుడు మనోజ్ జరాంగే నిర్ణయించారు. ఈ డిమాండ్‌తో తాను వచ్చే నెల 20 నుంచి ముంబైలోని ఆజాద్ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని శనివారం ప్రకటించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, కోట్లాది మంది మరాఠాలు జనవరి 20న ఈ దీక్షకు తరలివస్తారని చెప్పారు. ఇదిలావుండగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విడుదల చేసిన వీడియో సందేశంలో, మరాఠా రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వచ్చే నెల 24న విచారణ జరుపుతుందని, ఈ పరిణామాలు మరాఠాలకు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. తన ప్రభుత్వం మరాఠా రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, సంయమనం పాటించాలని కోరారు.

విద్యాశిఖరం హెచ్‌పీఎస్

ప్రఖ్యాత సంస్థలకు అధిపతులుగా పూర్వవిద్యార్థులు

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కీలక బాధ్యతల్లో పలువురు

స్కూల్ శతాబ్ది ఈవెంట్‌కు హాజరవుతున్న ప్రముఖులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): చారిత్రక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) విద్యాశిఖరంగా ఎదిగింది. విద్యా ప్రభను ఖండాంతరాలకు చాటుతున్నది. తన పూర్వ విద్యార్థులు ప్రపంచఖ్యాతి గడించడం వెనుక హెచ్‌పీఎస్ బలమైన పునాది వేసింది. హెస్‌పీఎస్ ఒడిలో విద్యాబుద్ధులు నేర్చిన విద్యార్థులు ప్రఖ్యాత కంపెనీలకు సీఈవోలుగా కొనసాగుతున్నారు. పలు సంస్థలను అధిపతులుగా, మరికొన్ని సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ.. భారతీయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. హైదరాబాద్‌లో 1923లో హైదరాబాద్ స్టేట్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ను నెలకొల్పారు. 1951 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి ఇప్పటికీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనను కొనసాగిన్నది. ఈ ఏడాది పొడవునా పాఠశాల శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఈ నెల 24 నుంచి 27 వరకు ముగింపు వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులైన పలువురు ప్రముఖులు, బ్యూరోక్రాట్లు, బిజినెస్ మాగ్నెట్లు, ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ నటులు, క్రికెటర్లు, న్యాయవాదులు హాజరుకానున్నారు. ప్రపంచంలోని ప్రఖ్యాత సంస్థలకు అధిపతులుగా తమ పాఠశాల పూర్వ విద్యార్థులు కొనసాగడం ఎంతో గర్వకారణమని హెచ్‌పీఎస్ వైస్ ప్రిన్సిపాల్ అమృత చంద్ర తెలిపారు. హాజరయ్యే వారిలో కొందరు ప్రముఖుల అభిప్రాయాలు..

మా జీవితాలపై హెచ్‌పీఎస్ ప్రభావం

హెచ్‌పీఎస్ చూపిన ప్రభావం పూర్వ విద్యార్థుల జీవితాలపై ప్రతిబింబిస్తున్నది. స్కూల్‌లో నేను గడిపిన కాలం ఎంతో మధురమైన జ్ఞాపకాలుగా ఉన్నాయి. బ్యాక్‌ఫీల్డ్‌లో క్రికెట్ ఆడటం, అకడమిక్స్ నా జీవితాన్ని ఒక ఆకృతిలో తీర్చిదిద్దడంలో కీలకం. నేటికీ అందరికీ మార్గనిర్దేశనం చేస్తుందని చెప్పాలి. జీవితంలో అనుకున్నది సాధించడానికి నాకు విశ్వాసాన్ని, దృక్పథాన్ని పెంపొందించింది.

-సత్యనాదెల్ల, మైక్రోసాఫ్ట్ సీఈవో (1984 బ్యాచ్)

నా సామర్థ్యాలపై నమ్మకం పెంచింది

పాఠశాల నాకు అన్ని రంగాలను పరిచయం చేసింది. అన్ని క్రీడల్లో, ముఖ్యంగా క్రికెట్‌లో పాల్గొనే అవకాశాన్ని ఇచ్చింది. నేను రాష్ట్ర అండర్-19కు వెళ్లాను. మాలో కొందరు ఇంగ్లాండ్‌లో పర్యటించారు. ఇది నాపై, నా సామర్థ్యాలపై నమ్మకం పెంచింది. 32 ఏండ్ల పోలీస్ సర్వీస్‌లో మంచి స్థానంలో నిలవడానికి తోడుగా ఉండింది. మానవత్వాన్ని నేర్పింది. టీచర్లు నేర్పిన పాఠ్యాంశాలు నన్ను ఎంతో ఉత్తమంగా తీర్చిదిద్దాయి. హెచ్‌పీఎస్ మధుర జ్ఞాపకాలను మరువలేం.

-సీవీ ఆనంద్, సీనియర్ ఐపీఎస్ (1986 బ్యాచ్)

పాఠశాల వ్యక్తిత్వాన్ని సృష్టించింది

పాఠశాల పుస్తకాల పురుగులను సృష్టించలేదు. వ్యక్తిత్వాన్ని సృష్టించింది. మనకు ఆసక్తి ఉన్న రంగంలో అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి వీలు కల్పించింది. ఇదే స్కూల్ గొప్పతనం. ఇంత గొప్ప బలమైన సంస్కృతి శాశ్వతంగా భద్రపర్చి మరెంతో బలపడాలని నేను నమ్ముతున్నాను.

-హరిప్రసాద్, అపోలో హాస్పిటల్స్ ప్రెసిడెంట్ (1982బ్యాచ్)

ఉపాధ్యాయులు, స్నేహితులు కలిస్తేనే జీవితం

ఇక్కడ చదివి ఎంతో కాలం గడిచింది. కానీ నేను ఇప్పటికీ ప్రతిదీ గుర్తుపెట్టుకున్నాను. ఇది అద్భుతమైన స్వేచ్ఛను అందించిన ప్రాంతం. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్నేహితులు కలిస్తేనే జీవితం అని నమ్ముతాను. క్రీడ, స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాల్లో కవాతు ఎంతో ఆకట్టుకునేది. ప్రస్తుతం దేశానికి గర్వకారణమైన ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల పేర్లు తరుచుగా వింటూనే ఉన్నాం.

- నాగార్జున అక్కినేని, ప్రముఖ నటుడు (1976 బ్యాచ్)

చేయిచేయి కలపాలి

పాఠశాలలో అద్భుతమైన సంప్రదాయంతోపాటు వర్తమానం ఉన్నది. ఉజ్వల వర్తమానం కోసం చేయిచేయి కలపాలి. అప్పుడే ఏదైనా కార్యరూపం దాలుస్తుంది. దేశ రాజ్యాంగ తత్వానికి అనుగుణంగా పౌరులను తీర్చిదిద్దడం సాధ్యం అవుతుంది. పాఠశాల కీర్తి పెరుగడంతోపాటు మనకూ స్వార్థకత ఉంటుంది.

-శ్రీరాం పంచు, సీనియర్ న్యాయవాది, మద్రాసు హైకోర్టు (1969 బ్యాచ్)

కుటుంబంతోసహా వస్తున్న

వారంపాటు జరిగే శతాబ్ది వేడుకలకు నా కుటుంబం, పిల్లలతోపాటు వచ్చేందుకు ఆత్రుతతో ఎదురుచూస్తున్నాను. స్నేహితులతోపాటు నాటి జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు వస్తున్నాను.

-జైలేష్ జెజురికర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రోక్టర్ అండ్ గాంబుల్ సంస్థ(1981 బ్యాచ్)

ఉత్తేజకరమైన క్షణం కోసం

నాది 1976 బ్యాచ్. స్కూల్ 50వ వార్షికోత్సవంలో నేను పాఠశాలలోనే ఉన్నాను. శతాబ్ది ఉత్సవాల్లో భాగం కావడం ఒక ఉత్తేజకరమైన క్షణం. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్న. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేలా మనమందరం సహకరించాలని ఆశిస్తున్నాను.

-సయ్యద్ అక్బరుద్దీన్, కౌటిల్య స్కూల్ డీన్, యూఎన్ మాజీ భారత ప్రతినిధి

నా మనస్సును వెనక్కి లాగుతుంది

నేను అవుట్ గేట్ నుంచి బయటకు వెళ్లి చాలా కాలమైంది. కానీ నా మనస్సు మాత్రం ప్రతిసారి నన్ను వెనక్కి లాగుతూనే ఉండేది. పదే పదే లోపలికి వస్తూ.. వైఎంసీఏ నుంచి వచ్చే బస్సు మమ్మల్ని తీసుకొచ్చి పాఠశాల ప్రాంగణంలో దించివెళ్తున్నట్టు ఊహించుకొనేది. ప్రస్తుతం వాట్సాప్ గ్రూప్ ఉన్నది. ఇప్పటికీ మేము పాఠశాలలో ఉన్నట్లుగానే మాట్లాడుకుంటాం. (1978వ బ్యాచ్)

- హర్ష భోగ్లే, క్రికెట్ వ్యాఖ్యాత

నాటి జ్ఞాపకాలు నేటికీ పదిలం

నేను 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థిని. హెచ్‌పీఎస్ నుంచి 30 ఏండ్ల క్రితం గ్రాడ్యుయేట్ అయినప్పటికీ, నాటి జ్ఞాపకాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి. నాకు చదువు చెప్పి, నన్ను ప్రేరేపించిన ఉపాధ్యాయులు, నా సహచరులు, స్నేహితులను మర్చిపోలేను. పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనే వాడిని. విజయనగర్ హౌస్‌లో సభ్యుడిగా ఉండటం అనుభూతినిచ్చింది.

-శంతను నారాయణ్, అడోబ్ సంస్థ సీఈవో

విద్యార్థుల కలల సాకారం ఇక్కడే

నేను మిడిల్ స్కూల్‌లో ఉన్నప్పుడు బాల్సా గ్లైడర్‌ను తయారు చేసి విసిరా. అది మా సైన్స్ టీచర్ జయనాథ్ తలుపు తట్టింది. అంతే ఆయన బైట కొచ్చి చూశారు. నేను దానితో ఆడుకోవడం చూసి.. ఈ విభాగంలో మీకు ఆసక్తి ఉందా? అని అడిగారు. నేను అవును అన్నాను. అప్పుడే హెచ్‌పీఎస్‌లో ఏరోమోడలింగ్ సెటప్ చేయడంలో సహకారం అందించారు. హెచ్‌పీఎస్‌లో గొప్ప ఫ్యాకల్టీ, ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. విద్యార్థుల కలలను సాకారం చేసుకోవడానికి హెచ్‌పీఎస్ తన శక్తిమేరకు ప్రత్నిస్తుంది.

-సతీశ్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ జాన్సన్ స్పేస్ సెంటర్ (1984 బ్యాచ్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.